662) బౌళి

ప॥ కనియు గానరు నీమహిమ కౌరవకంసజరాసంధులు।
మనుజులు దనుజుల జంపిరనగ వినిమరి నీశరణము చొరవలదా॥

చ॥ పుక్కిటనే లోకములు చూపితి వూతకిచన్నటు దాగితివి।
పక్కననే బండి చన్ని విరిచితివి బాలులు సేసేటిపను లివియా।
అక్కరతో తృణావర్తు నణచితివి ఆబోతులకీ టణచితివి।
చిక్కించి యనలము చేత మింగితి శిశువులు సేసేటిపను లివియా॥

చ॥ తొడిబడ మద్దులు భువిపై గూలగదొబ్బి యఘాసురు జంపితివి।
బడినే గోవర్ధనగిరి యెత్తితివి పడుచులు సేసేటిపను లివియా।
అడరి బ్రహ్మమాయకు బ్రతిమాయలు అట్టె గడించి నిలిచితివి।
పిడికిట చాణూరు నేనుగ గొట్టితి పిన్నలు సేసేటిపను లివియా॥

చ॥ కాళింగునిమద మణచి దవ్వుగా కడగడలకు బోజోసితివి।
గోలవై యజ్ఞఫలము లిచ్చితివి గోవాళు సేసేటిపను లివియా।
యీలీల శ్రీవేంకటాద్రిమీదనే యిందరికిని పొడచూపితివి।
బేలదనంబుల నెంచిచూడ పసిబిడ్డలు సేసేటిపను లివియా।